క్లుప్తంగా

కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం



తొర్రూరు రూరల్: శాసనసభ ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గ గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ అనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మాటేడు, చెర్లపాలెం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ప్రచారం నిర్వహించారు. అనంతరం ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ.. పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. పాలకుర్తి నియోజకవర్గానికి వలస వచ్చిన ఎర్రబెల్లి దయాకర్‌రావుకు మూడుసార్లు ఓట్లు గెలిపించినా.. ఎవరికీ న్యాయం జరగలేదన్నారు. కేవలం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. నాయకులు ముత్తినేని సోమేశ్వర్‌రావు, హమ్యానాయక్, సంతోష్, మేకల కుమార్, వెంకన్నరావు, విక్రంరెడ్డి, ప్రమీల, సోమరాజశేఖర్, అచ్చిరెడ్డి, నరేందర్‌రెడ్డి, మల్లేశంగౌడ్, నర్సింహరెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

యువతతోనే రాజకీయాల్లో మార్పు



మరిపెడ రూరల్: యువతతోనే దేశ రాజకీయాల్లో పెను మార్పు చోటు చేసుకుంటుందని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, బీఆర్ఎస్ పార్టీ డోర్నకల్ నియోజక వర్గ నాయకుడు డీఎస్ రవిచంద్ర అన్నారు. చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామానికి చెందిన పలువురు యువకులు మండలంలోని ఎల్లంపేటలో రవిచంద్రను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేవినవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జయ్యారం దుర్గమ్మకు రవిచంద్ర విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు రొట్టెల యాకన్న, సోషల్ మీడియా అధ్యక్షుడు చిలుముల రాజేష్, కమిటీ సభ్యులు అర్జున్‌రెడ్డి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం



కేసముద్రం: చదువులో ప్రతిభ కనబర్చిన పద్మశాలి విద్యార్థులను గురువారం మండల కేంద్రంలో పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సామల నర్సయ్య ఆధ్వర్యంలో ప్రతిభా అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై తిరుపతి మాట్లాడుతూ.. చదువుకు పేదరికం అడ్డుకాకూడదని, ఇష్టపడి చదివితే ఉన్నతశిఖరాలకు ఎదుగుతారన్నారు. ఎంఎస్ మెడికల్ సీటు సాధించిన హర్షిత, సాత్విక్(బీటెక్), వివేక్(ఎంసీఏ)పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన షాహిని, ప్రజ్ఞ, కార్తీక్, ఇంటర్‌లో శరణ్య, సాత్విక్, రాహుల్, డిగ్రీలో మహేష్, మౌనిక, ప్రకాష్‌లకు అవార్డులను అందజేశారు.

'యుద్ధభేరి' విజయవంతం చేయాలి

నెహ్రూసెంటర్: రాజకీయ పార్టీలు మాదిగ డిక్లరేషన్ ప్రకటించాలని, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 23 సీట్లు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర కార్యదర్శి పందుల సంజీవ, జిల్లా అధ్యక్షుడు కొండ్ర ఎల్లయ్య అన్నారు. నవంబర్ 5వ తేదీన ఇందిరాపార్క్ వద్ద జరిగే మాదిగల యుద్ధభేరి సభ కరపత్రాలను అంబేడ్కర్ సెంటర్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం సీఎం కేసీఆర్ చొరవ తీసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దళితులందరికీ దళితబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జినక సైదులు, కుక్కల సుధా, సీహెచ్‌రాధా, సంధ్య, అనంతుల రాజన్న, సురేష్, శ్రీను, సతీష్, జయరాజు, కృష్ణ, రాజు, అయిలయ్య, పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

దంతాలపల్లి: హాస్టల్‌లో ఉండి చదువుకోవడం ఇష్టం లేని ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని దాట్లలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన శంషొద్దీన్(21)హనుమకొండలో ఓ ప్రైవేట్ కళాశాల హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలకు దసరా సెలవులు రావడంతో ఇటీవల ఇంటికి వచ్చాడు. హాస్టల్‌లో ఉండడం ఇష్టంలేక.. ఎవరితో చెప్పుకోలేక తీవ్ర మనస్తాపం చెంది గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి షేక్ మహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు

మానుకోట జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాలు, పట్టణాల్లో ప్రతిష్ఠించిన విగ్రహాల వద్ద గురువారం మహిళలు కుంకుమ పూజలు చేశారు. పలుచోట్ల ఉత్సవ కమిటీ నిర్వాహకులు అన్నదానాలు చేశారు. ప్రతిఒక్కరూ ఆనందంగా ఉండాలని పూజలు నిర్వహించినట్లు పలువురు పేర్కొన్నారు.



మహబూబాబాద్ రూరల్ : శ్రీవాసవి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు



గార్ల: మర్రిగూడెంలో పూజల్లో పాల్గొన్న కనకయ్య



బయ్యారం: కుంకుమ పూజల్లో మహిళలు



దోర్నకల్: గొల్లచర్లలో..

అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తా..

● ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

మహబూబాబాద్ : తనకు మూడో సారి అవకాశం ఇస్తే మానుకోట నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన పట్టణ బూత్ కమిటీ సమావేశంలో శంకర్‌నాయక్ మాట్లాడారు. పార్టీకి కార్యకర్తలే బలం బలగమన్నారు. వలస పక్షులు వస్తున్నాయి.. అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. 45 రోజుల పాటు కార్యకర్తలు నాయకులు తన కోసం పని చేస్తే ఐదు సంవత్సరాలు అందరి కోసం పని చేస్తానన్నారు. గుడిసెలు లేని మానుకోట నియోజకవర్గంగా మార్చడమే తన లక్ష్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ టికెట్లు అమ్ముకుంటుందని ఆరోపించారు. అనంతరం పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్‌ఫరీద్, వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, రవి, రాజు, చిట్యాల జనార్దన్, మురళీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాసిరకంగా 'డబుల్' ఇళ్ల నిర్మాణం



ప్రజలతో మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

మహబూబాబాద్ అర్బన్ : డబుల్ బెడ్ రూమ్ నిర్మాణంలో నాసిరకం పనులు చేసి చేతులు దులుపుకున్నారని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్ నాయక్ అన్నారు. పల్లె పల్లెకు బీజేపీ ఇంటింటికీ హుస్సేన్ నాయక్ గురువారం ప్రజా ఆశీర్వాద యాత్రలో మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్ రూం లను ఆయన పరిశీలించి, మాట్లాడారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల పేరుతో ఎనిమిదేళ్లుగా పేదలను మోసం చేశారని ఆరోపించారు. కొన్ని ఇళ్లు సగం నిర్మించినప్పటికీ నాసిరకంగానే ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఎర్రంరెడ్డి సిద్దార్థ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ సింగారపు సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభ వెంకటేశ్వర్లు, నాయకులు రేవంత్ రెడ్డి, సందీప్, కిరణ్, సంపత్, సందీప్, పద్మ, ప్రేమ్ రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే రాష్ట్రం అభివృద్ధి

కురవి: రాబోయే ఎన్నికల్లో డోర్నకల్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని, బీజేపీతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా ఇన్చార్జ్ బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు రాంచంద్రరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ బూత్ స్థాయి సమావేశం నిర్వహించారు. వివిధ పార్టీల నుంచి 50 మంది కార్యకర్తలు బీజేపీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పేదల కోసం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా నాయకుడు, డోర్నకల్ బీజేపీ నేత బానోత్ ప్రభాసనాయక్, నాయకులు చీకటి మహేష్‌గౌడ్, భద్రసేనాగౌడ్, పెంటయ్య, పూర్ణచందర్ రెడ్డి, నగేష్ పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కారుతోనే సుస్థిర పాలన

● మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

తొర్రూరు: డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే సుస్థిర పాలన సాధ్యమని మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు అన్నారు. గురువారం స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఫంక్షన్ హాల్‌లో పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ అధ్యక్షతన నిర్వహించిన బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సమగ్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. తెలంగాణకు తొమ్మిదేళ్లలో రూ.9లక్షల కోట్లు మోదీ సర్కార్ కేటాయిస్తే కేసీఆర్ సర్కారు పక్కదారి పట్టించి అన్ని వర్గాలను మోసం చేసిందని ఆరోపించారు. సమావేశంలో జనగామ జిల్లా ఇన్చార్జ్ యాప సీతయ్య, నాయకులు లేగా రాంమోహన్ రెడ్డి, కర్ర శ్రీనివాస్ రెడ్డి, కోటేశ్వర్, మహేందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటాలు నిర్వహించాలి



గార్లలో జెండా ఆవిష్కరిస్తున్న కొమురయ్య

గార్ల: గీత కార్మికుల సమస్యల పరిష్కారంకోసం గీత కార్మికులు సమరశీల పోరాటాలు చేయాలని తెలంగాణ గీత పనివారాల సంఘం రాష్ట్ర కార్యదర్శి పోగుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం గార్లలో గీత పనివారాల సంఘం 66వ వార్షికోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ కార్యాలయంలో సంఘం జెండాను తోడేటి కొమురయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాజీ ఎంపీ ధర్మ భిక్షం నాయకత్వంలో 1957 అక్టోబర్ 19, 20 తేదీల్లో గార్లలో గీత పనివారాల సంఘం ప్రథమ మహాసభను నిర్వహించుకున్నామని పేర్కొన్నారు. గీత కార్మికుడు ప్రమాదవశాత్తు చెట్టుమీద నుండి పడిపోయే మృతిచెందితే ప్రభుత్వం రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, 60 ఏళ్ల దాటిన గీత కార్మికులకు రూ.5000 పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తోడేటి శ్రీనుగౌడ్, బి నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ కందునూరి మహేశ్వరరావు, తోడేటి సత్యనారాయణ, మండ రవి, విజయరాముడు, ఎం సాంబయ్య, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ

దంతాలపల్లి: పలు గ్రామాల్లో గీత కార్మికులు గురువారం కల్లు గీతకార్మిక సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గీత కార్మికులు మాట్లాడుతూ.. గీతకార్మిక సంఘం సొసైటీలు ఏర్పడి 60 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా జెండాను ఆవిష్కరించినట్లు తెలిపారు. గీత కార్మికులు తమ హక్కులను సాధించుకోవటం కోసం పాపన్న స్ఫూర్తితో పోరాడాలన్నారు.

అసమ్మతి నేతల బుజ్జగింపు



మాట్లాడుతున్న వద్దిరాజు రవిచంద్ర

గార్ల: గార్ల పీఏసీఎస్ కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర బీఆర్ఎస్ అసమ్మతి నేతలతో గురువారం బుజ్జగింపుల కార్యక్రమం కొనసాగించారు. బయ్యారం, గార్ల పీఏసీఎస్ చైర్మన్లు మూల మధుకర్‌రెడ్డి, వడ్లమూడి దుర్గాప్రసాద్, జెడ్పీ చైర్మన్ ఆంగోత్ బిందు తండ్రి ఆంగోత్ శ్రీకాంత్‌లతో ఎంపీ సమావేశమయ్యారు. ఇల్లందులో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. అసమ్మతి నేతలు మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలుపొందే వరకు ఎమ్మెల్యే భర్త హరిసింగ్‌నాయక్ మాతో మంచిగా ఉంటాడని, గెలిచిన అనంతరం మమ్ముల్ని లెక్కచేయడని ఎంపీ రవిచంద్రకు వివరించారు. నవంబర్ 1న ఇల్లందులో నిర్వహించే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని రవిచంద్ర కోరినట్లు తెలిసింది. సభ తర్వాత అన్ని సర్దుకుంటాయని చెప్పినట్లు సమాచారం.

తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

కేసముద్రం: ఓ ఇంటికి వేసిన తాళం పగులగొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు బీరువాలో ఉన్న నగదు రూ.50వేలు, వెండి వస్తువులను అపహరించిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రంస్టేషన్‌లోని కిష్టాపురం కాలనీలో అబ్బూరి హనుమయ్య తన ఇంటికి తాళం వేసి, హనుమకొండకు వెళ్లాడు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాన్ని పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువా లాకర్‌ను పగుల గొట్టి, అందులో ఉన్న నగదు రూ.50వేలు, 275 గ్రాముల వెండి ప్లేట్, రెండు గ్లాసులను అపహరించి పరారయ్యారు. కాగా గురువారం ఉదయం ఇంటి పనిమనిషి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండటంతో.. హనుమయ్యకు సమాచారం అందించింది. ఆయన ఫిర్యాదు మేరకు, రూరల్ సీఐ రమేష్, ఎస్సై తిరుపతి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం క్లూస్ టీం ఆధ్వర్యంలో వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించొద్దు



గార్ల: మద్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

మహబూబాబాద్ రూరల్ : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మహబూబాబాద్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో బెల్టు షాపులు నిర్వహించొద్దని రూరల్ ఎస్సై రాంచరణ్ అన్నారు. మహబూబాబాద్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని బెల్టు షాపుల నిర్వాహకులు 95 మందిని గురువారం తహసీల్దారు ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా రూరల్ పోలీసు స్టేషన్ ఆవరణలో బెల్టు షాపుల నిర్వాహకులకు ఎస్సై రాంచరణ్ ఎన్నికల సంఘం ఆదేశాలు, నిబంధనలపై వివరించారు. ఎవరైనా సరే ఎన్నికల నిబంధనలు అతిక్రమించి బెల్టు షాపులు ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయల చొప్పున జరిమానా విధిస్తారని తెలిపారు. రూరల్ రెండో ఎస్సై కుమారస్వామి, ఏఎస్సై రమేష్ పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు

మరిపెడ రూరల్: గుడుంబా కాచిన, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని మరిపెడ సీఐ లావుడ్య రాజు హెచ్చరించారు. మరిపెడ మండలం బాలృతండా గ్రామ పంచాయతీ పరిధిలోని గుడుంబా స్థావరాలపై మరిపెడ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా నిల్వ చేసిన 1,500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. 100 కిలోల నల్ల బెల్లం, 20 కిలోల పటిక, 20 లీటర్ల నాటు సారాయిని స్వాధీన పర్చుకున్నట్లు సీఐ తెలిపారు. మరిపెడ ఎస్సై దూలం పవన్, సిబ్బంది పాల్గొన్నారు.

గార్ల: మండలంలోని బెల్ట్‌షాపులు, కాపుసారా స్థావరాలపై గురువారం పోలీసులు దాడులు నిర్వహించి మద్యం, కాపుసారాను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై బానోత్ వెంకన్న వెల్లడించారు. పూమ్యాతండా గ్రామంలో ఇస్లావత్ మోహన్ కాపుసారా స్థావరంపై దాడిచేసి రూ.17,000 విలువ గల 42.5 లీటర్ల కాపుసారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అదే విధంగా తిర్లాపురానికి చెందిన జర్పుల వాల్యా బెల్ట్‌షాపుపై దాడి చేసి రూ.5,742 విలువ గల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ బాలకృష్ణ, సిబ్బంది రాము పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

డోర్నకల్: మండలంలోని కస్నాతండా శివారులోని బెల్టు దుకాణంలో గురువారం డోర్నకల్ పోలీసులు మద్యం సీసాలు స్వాధీనపర్చుకున్నారు. ఎస్సై సంతోష్‌రావు తెలిపిన వివరాల ప్రకారం కస్నాతండా శివారులోని బెల్టు దుకాణంలో తనిఖీలు నిర్వహించి రూ.5,000 విలువైన మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దంతాలపల్లి: 15 లీటర్ల గుడుంబా, 10 లీటర్ల మద్యం, 10 బీరు సీసాలు స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు గురువారం పోలీసుల తెలిపారు. మండలంలోని పెద్దముప్పారంలో 15 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని గుడుంబా తయారు చేస్తున్న ముత్యం సుజాత, వేములపల్లిలో బెల్టుషాపులపై రైడ్ చేసి షాపు నిర్వాహకుడు ఇరుగు రవి వద్ద 10 లీటర్ల మద్యం, 10 బీరు సీసాలు స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు. సిబ్బంది శంకర్, బగ్గు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో అభివృద్ధిని కొనసాగిస్తా..



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ముస్లిం నాయకులు

డోర్నకల్: ఎమ్మెల్యేగా మరోసారి గెలిపిస్తే డోర్నకల్ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ తెలిపారు. గురువారం ఆయన డోర్నకల్‌తోపాటు పలు గ్రామాల్లో పర్యటించి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను కలిశారు. వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. డోర్నకల్‌లో సీఎస్ఐ బిషప్ డాక్టర్ కె.పద్మారావుతోపాటు అమ్మపాలెం, ఉయ్యాలవాడ, గొలచర్ల గ్రామాల్లో పర్యటించి పార్టీ నాయకులు, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి వారితో చర్చించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నున్నా రమణ, ఎంపీపీ ధరంసోత్ బాలునాయక్, మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, మహబూబాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ విద్యాసాగర్, పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి భిక్షం రెడ్డి, సర్పంచులు నున్నా జయలక్ష్మి, సమ్మిరెడ్డి, రాంబాయిశంకర్, ఎంపీటీసీ సభ్యులు నున్నా మల్లిఖార్జున్, కౌన్సిలర్లు సురేందర్‌జైన్, శరత్, అశోక్, నాయకులు రామనాథం, సత్తిరెడ్డి, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

రెడ్యానాయక్‌ను గెలిపించాలి

కురవి: రాబోయే ఎన్నికల్లో డీఎస్ రెడ్యానాయక్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కురవి సొసైటీ చైర్మన్ దొడ్డ గోవర్ధన్‌రెడ్డి కోరారు. మండలంలోని నేరడ గ్రామంలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ గుండోజు శ్రీనివాస్, నాయకులు గుగులోత్ రవి, కొండబత్తుల రవీందర్, మల్లెపాక మధు పాల్గొన్నారు.

మూఢ విశ్వాసాలను విడనాడాలి

దంతాలపల్లి: మూఢవిశ్వాసాలను నమ్మి ప్రాణాలు కోల్పోవద్దని ఎస్సై రమేష్‌బాబు అన్నారు. మండలంలోని గున్నెపల్లిలో బుధవారం రాత్రి మూఢ విశ్వాసాలపై పోలీస్ కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యం ఎంతో అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు మంత్రాలు, భానుమతి, చేతబడి, దయ్యాలు లాంటివి నమ్ముతున్నారన్నారు. జబ్బు చేసిన వ్యక్తులను ఆస్పత్రిలకు కాకుండా భూతవైద్యుల వద్దకు తీసుకెళ్లి డబ్బు వృథా చేసుకోవద్దని సూచించారు. అనంతరం త్వరలో జరగబోయే ఎన్నికల విధి, విధానాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ గండి వెంకటనారాయణ, ఎంపీటీసీ రాధిక పాల్గొన్నారు.

లారీ ఢీకొని 10 గొర్రెల మృత్యువాత

కురవి: లారీ ఢీకొని 10 గొర్రెలు మృతిచెందిన సంఘటన మండలంలోని అయ్యగారిపల్లిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. అయ్యగారిపల్లిలో తాడబోయిన అలియాస్ బర్ల ఉప్పలయ్యకు చెందిన గొర్రెల మందను తోలుకుంటు జాతీయ రహదారిని దాటుతుండగా మరిపెడ వైపు నుంచి కురవి వైపు వస్తున్న లారీ గొర్రెల మందను ఢీకొట్టింది. ఈ ఘటనలో 10 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా మరి కొన్ని గొర్రెలకు గాయాలై చావుబతుకుల మధ్య ఉన్నాయి. ఒక్క సారిగా గొర్రెలు రోడ్డుపైకి రావడంతో లారీ డ్రైవర్ బ్రేక్ వేసినప్పటికీకీ ఫలితం లేకుండా పోయింది. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

నేడు టీపీ జేఏసీ జిల్లా సదస్సు

నెహ్రూసెంటర్: తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీజేఏసీ) ఆధ్వర్యంలో పదేళ్ల తెలంగాణ పాలన-ప్రజల ఆకాంక్షలు-పౌర సమాజం కర్తవ్యం అనే అంశంపై జిల్లా కేంద్రంలోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో నేడు జిల్లా స్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని జేఏసీ జిల్లా కన్వీనర్ మామిడాల సత్యనారాయణ గురువారం తెలిపారు. ప్రొఫెసర్ కోదండరాం, కూరపాటి వెంకటనారాయణ హాజరవుతున్నారని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

మహబూబాబాద్ రూరల్ : శనిగపురం గ్రామానికి వెళ్లేదారిలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని పర్వతగిరి గ్రామానికి చెందిన కోట వెంకటాద్రికి తీవ్రగాయాలయ్యాయి. వెంకటాద్రి తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా శనిగపురం గ్రామానికి వెళ్లే దారిలో ఎదురుగా వస్తున్న ఓ గుర్తు తెలియని ఆటో ఢీ కొట్టిందని స్థానికులు తెలిపారు. కుడికాలు, కుడిచేయి విరిగి తీవ్రగాయాలు కావడతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

సంక్షిప్త సమాచారం..

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



డోర్నకల్: డోర్నకల్, గుండ్రాతిమడుగు రైల్వే స్టేషన్ల మధ్య రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందాడు. డోర్నకల్ జీఆర్పీ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. డోర్నకల్, గుండ్రామడుగు రైల్వే స్టేషన్ మధ్య 451/2-4 కిలోమీటర్ నంబర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి.. రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు గురువారం గుర్తించినట్లు తెలిపారు. సుమారు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వ్యక్తి మృతదేహం వద్ద నయాండాలి బస్ స్టేషన్‌కు సంబంధించిన బస్ టికెట్ లభ్యమైనట్లు తెలిపారు. ఖమ్మంకు చెందిన అన్నం సేవాసమితి సభ్యుల సహకారంతో మృతదేహాన్ని ఘటనాస్థలం నుంచి ఖమ్మం ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 58600 నంబర్ ద్వారా సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

తట్టుపల్లిలో వైద్య శిబిరం

కురవి: మండలంలోని తట్టుపల్లిలో ఉప కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని గురువారం ఏర్పాటు చేశారు. జ్వరం, దగ్గు, జలుబు తదితర వ్యాధులతో బాధపడుతున్న 53 మందిని పరీక్షించి, రక్త నమూనాలు సేకరించారు. మందులను అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ షఫీ మాట్లాడుతూ.. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. డెంగీ, మలేరియా పరీక్షల కిట్‌లను సబ్ సెంటర్లలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మూడు రోజుల నుంచి జ్వరం లక్షణాలతో బాధపడుతున్న వారికి సబ్ సెంటర్‌లోనే పరీక్షలు చేసి మందులు అందిస్తున్నామన్నారు. జ్వరపీడితులు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని, ప్రభుత్వం అందించే సేవలు వినియోగించుకోవాలని సూచించారు.

నియామకం

 

సింగని మహేష్ మహేందర్

కేసముద్రం: ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(మెపా) మహబూబాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా కేసముద్రం మండలం అర్పనపల్లి గ్రామానికి చెందిన సింగని మహేష్ ముదిరాజ్, మెపా నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా కోరుకొండపల్లికి చెందిన గైరబోయిన మహేందర్‌ను నియమించారు. ఈమేరకు మెపా రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కేవీ రమణముదిరాజ్ గురువారం ఉత్తర్వులు అందజేశారు.



పిట్టల నరేష్

గూడూరు: ఇనుగుర్తి మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పిట్టల నరేష్‌ను నియమిస్తున్నట్లు గురువారం మండల పార్టీ అధ్యక్షుడు కూరెళ్లి సతీష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తనకు పదవి రావడానికి సహకరించిన మిత్రులు, నాయకులకు నరేష్ కృతజ్ఞతలు తెలిపారు.

బతుకమ్మ సంబురాలు

మహబూబాబాద్ అర్బన్ : జిల్లా కేంద్రంలోని వికాస్ విద్యాసంస్థల్లో గురువారం కళాశాల చైర్‌పర్సన్ బిక్కి ఇందిర, విద్యార్థినులు బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బిక్కి వెంకటేశ్వర్లు మాట్లాడారు. విద్యార్థినులు పాటలు పాడుతూ.. నృత్యాలు చేశారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీరన్న, అధ్యాపకులు వెంకన్న, సారంగం, యాకన్న, సునీత, ఆసియా నస్రీన్, వెంకటేశం, కిషన్, శ్రీనివాస్, యుగేందర్, భిక్షపతి, నాగరాజు పాల్గొన్నారు.

పదునెట్టాంబడికి పంచలోహ తాపడం



కేసముద్రం: మండల కేంద్రంలోని శ్రీధర్మశాస్త (అయ్యప్పస్వామి) ఆలయంలో ఏర్పాటు చేసిన ఏకశిలా పదునెట్టాంబడిపై పంచలోహ తాపడం పనులు గురువారం పూర్తయినట్లు ఆలయ చైర్మన్ వోలం చంద్రశేఖర్, కార్యదర్శి పాలెపల్లి యాకుబ్‌రెడ్డి, కోశాధికారి బోగోజు నాగేశ్వరాచారి తెలిపారు. తెలంగాణలో ఏకశిలా పదునెట్టాంబడి కలిగిన రెండో ఆలయమని, 54 మంది దాతలు అందించిన విరాళాలతో తమిళనాడు రాష్ట్రానికి చెందిన స్థపతి రామ్‌కుమార్ శిష్యబృందంచే, పదునెట్టాంబడి(18మెట్లు)కి పంచలోహ తాపడం, ధ్వజస్తంభానికి పంచలోహ తొడుగు పనులు పూర్తయినట్లు వారు పేర్కొన్నారు.